

భయం వద్దు.. క్యాన్సర్‌కు ఉంది ఆన్సర్

- నేడు వరల్డ్ రోజ్ డే
- క్యాన్సర్ బాధితులకు భరోసా కల్పిస్తూ ఏటా వేడుకలు
- గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు
- ఉచితంగా ఆపరేషన్లు
- ఆధునిక చికిత్సలతో క్యాన్సర్ నివారణ

క్యాన్సర్ ... ఈ వ్యాధి పేరు చెబితేనే చాలా మందికి ఒంట్లో వణుకు పుట్టుకొస్తుంది. వస్తే చనిపోవడమే అనే అపోహల్లో ప్రజలు ఉన్నారు. పూర్వం రాచపుండుగా పిలువబడే క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. వ్యాధిగ్రస్తుల్లో భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ఏటా ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 22న రోజ్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం. – గుంటూరు మెడికల్





లీనియర్ యాక్సిలేటర్ వైద్య పరికరం

రోజ్ డే నేపథ్యం

కెనడా దేశానికి చెందిన 12 ఏళ్ల మెలిండా రోజ్ 1994లో క్యాన్సర్ వ్యాధికి గురైంది. అది కూడా చాలా అరుదైన బ్లడ్ క్యాన్సర్ అవ్వడం, కొన్ని వారాల్లోనే బాలిక చనిపోతుందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. కాని రోజ్ ఎలాంటి బాధ లేకుండా, భయపడకుండా ఆస్పత్రిలో ఉన్న రోగులకు రోజూ పువ్వులు అందించి, వారికి కవితలు వినిపించి, మనో ఉల్లాసాన్ని కలిగించింది. ఈ విధంగా ఆరునెలల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోగుల్ని చిరునవ్వుతో పలుకరిస్తూ ఉత్తరాలు రాస్తూ వారిని ఆనందింపజేసి సెప్టెంబరు 22న మరణించింది. ఆ బాలిక జ్ఞాపకార్థం ఏటా రోజ్‌డేను నిర్వహిస్తున్నారు.

క్యాన్సర్ రోగులకు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి భరోసా

ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించగానే పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నారు. వైద్య రంగంలో దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనేక సంస్కరణలు చేశారు. ముఖ్యంగా క్యాన్సర్ రోగులకు ఆయన పెద్ద భరోసా కల్పిస్తూ ప్రొసీజర్స్ పెంచారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో 2019 వరకు రోగులకు 223 ప్రొసీజర్స్‌కు మాత్రమే చికిత్స అందించారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 648 ప్రొసీజర్స్‌కు ఉచితంగా చికిత్స అందిస్తూ పెద్ద భరోసా కల్పించింది. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2019 నుంచి 2023 ఆగస్టు వరకు మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ వైద్య విభాగాల ద్వారా జిల్లాలో నాలుగేళ్లలో 14,626 మందికి ఉచితంగా చికిత్స అందించారు. క్యాన్సర్ బాధితుల ప్రాణాలు కాపాడేందుకు పలు రకాల చికిత్సల కోసం ప్రభుత్వం రూ.117.47 కోట్లు ఖర్చు చేసింది.

క్యాన్సర్ కారణాలు

- ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగం
- సిగిరెట్, బీడీ, చుట్ట, పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా.. ఇలా ఏ రూపంలో పొగాకును తీసుకున్నా వస్తుంది.
- మద్యపానం
- వ్యాయామం చేయకపోవడం
- ఆకుకూరలు తినకపోవడం
- ఊరగాయపచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినడం
- అధిక బరువు

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌కు నేడు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశం ఉందా లేదా నిర్ధారించే బీఆర్‌సీఏ-1, 2 పరీక్షలు ఉన్నాయి. క్యాన్సర్ ట్రీట్‌మెంట్ విఫలం అయితే బయోథెరపీ ద్వారా వైద్యం చేసి ప్రాణాలు కాపాడవచ్చు. లాప్రోస్కోపిక్, రొబోటిక్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి.

–డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సుమారు రూ. 45 కోట్లతో ప్రభుత్వ సహకారంతో గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేశాం. ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో వ్యాధిగ్రస్తులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. కోట్ల రూపాయలు ఖరీదు చేసే అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, ట్రాకీథెరపీ, సీటీ స్టిమ్యులేటర్ వైద్య పరికరాలు ప్రభుత్వం అందజేసింది. తాజాగా పెట్‌స్కాన్ పరికరం మంజూరు చేసింది. మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, రేడియేషన్, న్యూక్లియర్ మెడిసిన్, రేడియోథెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నాం. క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి సైతం ప్యాలేటివ్ కేర్ చికిత్సలు ఉచితంగా ఇళ్లకు వెళ్లి అందిస్తున్నాం. మందులు కూడా ఉచితంగా అందించి క్యాన్సర్ రోగుల్లో మనోధైర్యం కల్పిస్తున్నాం.

– నన్నపనేని సదాశివరావు, నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్



స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా మహిళలు 45 సంవత్సరాలు దాటాక ప్రతి ఏడాది మ్యామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. లంగ్ క్యాన్సర్ రాకుండా, పేగు సంబంధిత క్యాన్సర్లు 55 సంవత్సరాలు దాటిన వారు సిటీస్కాన్, కొలనోస్కోపి చేయించుకోవాలి. తొమ్మిదేళ్ల నుంచి 11 ఏళ్లలోపు బాలికలకు, 45 సంవత్సరాల్లోపు మహిళలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. హెపటైటీస్ బీని కూడా వ్యాక్సిన్ వేయించుకుని రాకుండా నిరోధించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, మెడికల్ అంకాలజిస్ట్

క్లుప్తంగా

రేపు విద్యుత్ లోక్ అదాలత్

గుంటూరు ఈస్ట్: పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్‌లో శనివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు గుంటూరు తూర్పు, పశ్చిమ, గుంటూరు రూరల్, పెదకాకాని మండలాల్లోని వినియోగదారులకు విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్, సాంకేతిక సభ్యుడు కె.వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యుడు ఎ.రాందాస్, స్వతంత్ర సభ్యుడు ఎ.సునీత పాల్గొంటారని పేర్కొన్నారు. నాలుగు మండలాల పరిధిలోని వినియోగదారులు విద్యుత్ సమస్యల్ని రాతపూర్వకంగా అదాలత్‌లో సమర్పించి, పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

అవగాహనతోనే అల్జీమర్స్‌కు కట్టడి



గుంటూరు మెడికల్: అవగాహనతో అల్జీమర్స్ వ్యాధిని కట్టడి చేయవచ్చని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు, మానసిక వైద్యనిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్.నరసింహారావు అన్నారు. వరల్డ్ అల్జీమర్స్ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మానస హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ 65 సంవత్సరాలు దాటిన వారిలో మతిమరుపు రావడం సహజమని తెలిపారు. అయితే, కొందరిలో దీంతో పాటు మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. మందుల ద్వారా వ్యాధిని నియంత్రణతో పెట్టడంతో పాటు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల పాత్ర కూడా కీలకమని పేర్కొన్నారు. అల్జీమర్స్, మానసిక సమస్యల్ని గుర్తించే విధానాలపై రోగుల సహాయకులకు కౌన్సెలింగ్ చేశారు. మానసిక వైద్యుల నిపుణుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ అల్జీమర్స్ వ్యాధి వంశపారంపర్యంగా సోకే అవకాశం ఉందన్నారు. జ్ఞాపక శక్తి పెంపొందించే పజిల్స్, కొన్నిరకాల వ్యాయామాల ద్వారా దరి చేరకుండా చూడవచ్చని తెలిపారు. వృద్ధులకు మానస హాస్పటల్‌లో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీరమ్య, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్ట బద్ధత కల్పించాలి



చేబ్రోలు: ప్రస్తుత పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన చేబ్రోలులో రాస్తారోకో జరిగింది. గత 12 రోజులుగా చేబ్రోలులో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు గురువారం లైబ్రరీ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వేమూరు సుధీర్, నియోజకవర్గ ఇన్‌చార్జి హృదయరాజులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి మోసగించిందని తెలిపారు.

బీసీ ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి: పార్లమెంటులో వెనుకబడిన తరగతుల సభ్యులపై అనుచిత వ్యాఖ్యల్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. కొందరు అగ్రవర్ణ, ఆధిపత్య కులాల పార్లమెంటు సభ్యులు ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన సహచర సభ్యుల్ని కించపరచేలా, ఆధిపత్య ధోరణిలో అగౌరవపరుస్తూ మాట్లాడటం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు. ఈ విధమైన ధోరణితో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుండటం దారుణమని పేర్కొన్నారు. రాజ్యాంగంలో భావప్రకటన స్వేచ్ఛను కల్పించటమంటే ఇతరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మాట్లాడటమని గుర్తుచేశారు. వెనుకబడిన తరగతుల ప్రజా ప్రతినిధులపై అన్ పార్లమెంటు పదాల్ని ఉపయోగించడం భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన కోరారు.

రేపు సంజీవదేవ్ పుస్తకంపై చర్చా వేదిక

తెనాలి: ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో నెల నెలా నిర్వహిస్తున్న చర్చా కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న బి.లలితానంద ప్రసాద్ రచించిన 'ఎప్పటికీ...అందరికీ సంజీవదేవ్' పుస్తకంపై చర్చా వేదికను ఏర్పాటుచేశారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగే చర్చా వేదికకు సమన్వయకర్తగా జి.ఎస్.నాగేశ్వరరావు వ్యవహరిస్తారు.

అక్కినేని నాగేశ్వరరావుకు ఘన నివాళి

లక్ష్మీపురం: తెలుగు సినిమా ఎవర్ గ్రీన్ హీరో అక్కినేని నాగేశ్వరరావు అని, తొంభై మూడు సంవత్సరాల వరకు నిరవధికంగా నటిస్తూ ప్రేక్షకుల్ని అలరించి వారి హృదయాల్లో చిరంజీవిగా కొలువై ఉన్నారని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ బి.వి.రామ్‌కుమార్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ అక్కినేని మహా నటుడే కాకుండా మహామనీషి అని కొనియాడారు. ఆయన మాదిరి జీవితపు చివరి రోజుల వరకూ నటించిన నటుడు మరొకరు లేరని గుర్తు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత జనరల్ మేనేజర్ గూడవల్లి నాగేశ్వరరావు, గాయకుడు బిళ్లా అశోక్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఏఎన్నార్ శత జయంతి వేడుకలు

పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 23న నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపకులు డాక్టర్ తోటకూర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రముఖ సాహిత్య పరిశోధకులు పారా అశోక్ కుమార్ రచించిన 'అక్కినేని 100' (శత వసంతాల అక్కినేనికి చిత్రాంజలి) పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ రంగాలలో విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు తెలియజేశారు. అనంతరం అక్కినేని పాటల సంగీత విభావరి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అక్కినేని అభిమానులు, సినీ, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.

తండ్రిపై కొడుకు దాడి

తెనాలి రూరల్: మద్యం మత్తులో తండ్రిపై కొడుకు దాడి చేసి గాయపర్చిన ఘటన తెనాలిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుతోటకు చెందిన షేక్ జమాల్ బుధవారం రాత్రి మద్యం తాగి వచ్చి, ఆ మత్తులో తండ్రి అల్లాబక్షుపై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడు తెనాలి జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతూ, ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

ఐకమత్యంతోనే దళితుల రాజ్యాధికార సాధన

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ చెల్లదని పార్లమెంటులో కేంద్ర మంత్రులు, అన్ని రాజకీయ పార్టీ ఎంపీలు చెప్పారని, ఇప్పటికైనా మంద కృష్ణ మాదిగ నిజం తెలుసుకొని దళితుల రాజ్యాధికారం కోసం కలసికట్టుగా పని చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన హలో మాల-చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా గురువారం పార్లమెంటులో మంత్రులు, ఎంపీలను కలసి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా గోళ్ల అరుణ్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రులు, ఎంపీలు ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని తెలిపినా, మంద కృష్ణ మాదిగ రాజకీయ స్వలాభం కోసమే ఉద్యమాన్ని చేస్తున్నారని విమర్శించారు. ఆయన ఇప్పటికైనా నిజం తెలుసుకొని దళితుల రాజ్యాధికారం సాధించేందుకు కలసికట్టుగా పని చేయాలని కోరారు. ఇప్పటివరకు అగ్రవర్ణ ఆధిపత్యం కింద ఉన్న ఆయన ఆస్తులు పెరిగాయే తప్ప దళితులకు న్యాయం చేసిందేమి లేదని విమర్శించారు. నూతన పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టినందుకు మాల మహానాడు మహిళా నాయకులు, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బందెల యాదలక్ష్మి, పిల్లి మేరి హర్షం వ్యక్తం చేశారు. నూతన పార్లమెంటులో మొట్టమొదటిగా మహిళా బిల్లు ప్రవేశ పెట్టడం శుభ పరిణామమని తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి రాందాస్ అత్వాలేని కలసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోదా జాన్ పాల్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బొగ్గుల మల్లేశం, సిరిసిల్ల అధ్యక్షుడు దోషం చంద్రం, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేందర్, దయాకర్, మాల మహానాడు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: భార్యను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్గా మాన్యంలో నివసించే జంగం రవికిరణ్‌కు స్వాతితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. రవికిరణ్ మద్యానికి బానిసై భార్యను తరచూ కొడుతూ, వేధిస్తున్నాడు. ఈ మేరకు స్వాతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

వ్యభిచారానికి పాల్పడుతున్న వ్యక్తిపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లచెరువు తొమ్మిదో లైనులోని ఓ ఇంటిలో వ్యభిచారం జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు గురువారం దాడి చేశారు. ఓ వ్యక్తితో పాటు ఇద్దరు మహిళల్ని స్టేషన్‌కు తరలించారు. వ్యక్తిపై కేసు నమోదు చేసి, మహిళల్ని రెస్క్యూ హోంకు తరలించారు.

పోరాటాలకు పుట్టినిల్లు ఎస్టీయూ



కాకుమాను: పోరాటాలకు పుట్టినిల్లు ఎస్టీయూ అని హక్కులు, బాధ్యతల్ని రెండు కళ్లుగా భావించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం ఎస్టీయూ అని ఆ సంఘ గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షుడు గేరా మోహనరావు అన్నారు. మండలంలోని గ్రామాలలో ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఎస్టీయూ ఏర్పడి గత 77 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఎస్టీయూలో సభ్యులుగా చేరి సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సంఘంలో సభ్యులుగా నమోదు చేయించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ ప్రధాన కార్యదర్శి కాండ్రు సద్గుణరావు, జిల్లా కార్యదర్శి మద్దిరాల వెంకటేశ్వర్లు, జిల్లా సభ్యులు లంకపల్లి వీరాంజనేయులు, ఆర్థిక కార్యదర్శి శివకోటేశ్వరరావు, సాతులూరి సుబ్బారావు, తుపాకుల వాసు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళతామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 15, 17, 53 డివిజన్ల పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీ, హుస్సేన్‌నగర్, సంజీవయ్యనగర్‌లలో గురువారం రూ. 2 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే గుంటూరు నగరాభివృద్ధి 90 శాతం జరిగిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వై.ఎస్.జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామనబోయిన అజయ్‌యాదవ్, ధూపాటి వంశీ, ఫర్జానా, ఐశెట్టి శ్రీను, రెడ్డి, ధూపాటి సాల్మాన్, బిఖారి, అక్కులయ్య, మరియమ్మ పాల్గొన్నారు.

బిల్లులో బీసీ మహిళలకు అన్యాయం

ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి. రాజసుందరబాబు



ర్యాలీ నిర్వహిస్తున్న రాజసుందరబాబు, మహిళలు

నెహ్రూనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హడావుడిగా పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి దానిని ఆమోదింపజేయడం కేవలం రాజకీయ ఎత్తుగడలో భాగమేనని ఐడియల్ దళిత్ ఉమెన్ అసోసియేషన్(ఇద్వా) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు పేర్కొన్నారు. బిల్లులో బీసీ మహిళలకు అన్యాయం జరిగిందని తెలిపారు. అసలు ఎవరికి ఎంత శాతం ఇస్తుందో చెప్పకుండా బిల్లు పాస్ చేయడం ఎన్నికల స్టంట్ అని విమర్శించారు. బిల్లులో లోపాల్ని నిరసిస్తూ గురువారం అంకమ్మ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లును నేడు బీజేపీ ప్రభుత్వం హడావుడిగా ప్రవేశపెట్టి తామేదో మహిళలను ఉద్ధరిస్తున్నట్లు ప్రవర్తించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. మణిపూర్‌లో దురాగతాల్ని ఐక్యరాజ్యసమితితో పాటు ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటున్న సమయంలో ఆ ఆకృత్యాల్ని కప్పిపుచ్చుకునేందుకు బిల్లును తాత్కాలికంగా తెరపైకి తీసుకువచ్చారని మండిపడ్డారు. బీసీ అని చెప్పుకునే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ మహిళలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ఇద్వా కార్యదర్శి అలూరి కోటేశ్వరి, ముక్కు సుష్మ, తాటి సౌమ్య పాల్గొన్నారు.

మహిళ బిల్లులో ఓబీసీలకు ప్రాధాన్యత కరువు

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళ బిల్లులో ఓబీసీలకు ప్రాధాన్యత లేదని సామాజిక వేత్త, సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు (వైకే) గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలకు స్థానం లేకుండా చేసి, మహిళా సాధికారిత సాధిస్తామని చెప్పడం బూటకమని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడి ఉత్సవాలు

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలో వాసవీ యూత్ ఆధ్వర్యంలో 25వ గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామి వస్త్ర గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్ని వాసవీ యూత్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగ వెంకటనారాయణ, కోశాధికారి కాజా శ్యాంసుందర్ పర్యవేక్షించారు.

నగదుతో వినాయకుడికి అలంకరణ

నెహ్రూనగర్: ప్రగతీనగర్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో 15వ గణపతి మహోత్సవంలో భాగంగా గురువారం రూ.10 వేల విలువైన నోట్లతో వినాయకుడిని అలంకరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



ఆర్. అగ్రహారంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రగతీనగర్‌లో నగదు అలంకరణలో వినాయకుడు

తెనాలిలోనే నంది నాటకోత్సవాలు నిర్వహించాలి

మా ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా, మిలటరీ ప్రసాద్

తెనాలి అర్బన్: నంది నాటకోత్సవాల్ని కళల కాణాచి తెనాలిలో నిర్వహించాలని మూవీ ఆర్టిస్ట్ అసోసియేసన్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. తెనాలి మండలం పెదరావూరులోని ఫిల్మ్ స్టూడియోలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు. తెనాలిలో వాటిని నిర్వహిస్తే మా ఏపీ యూనియన్‌లోని సభ్యులు సేవలందించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో మా ఏపీ సంయుక్త కార్యదర్శి మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన



మార్కెట్ వంతెనపై రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

తెనాలి రూరల్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. తెనాలి మార్కెట్ వంతెన వద్ద గురువారం సాయంత్రం కూడలిలో బైఠాయించి ఆందోళనకు దిగారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగల్ని మోసం చేస్తోందని ఆరోపించారు. వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆపేదిలేదని, ప్రాణాలైనా అర్పించి ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధిస్తామని తెలిపారు. ట్రాఫిక్ ఎస్ఐ బి. శివరామయ్య, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కెజియాగ్రేస్

ప్రత్తిపాడు: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ అన్నారు. మండల పరిధిలోని రెండు గ్రామాల్లో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను నిర్వహించారు. కొండేపాడులో వైద్యాధికారి డాక్టర్ స్రవంతి 27 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, తుమ్మలపాలెంలో డాక్టర్ కెజియాగ్రేస్ 45 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతలపై వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు లీవ, విజయ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అభివృద్ధికి ప్రజలు అండగా నిలువాలని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కోరారు. రైల్వే స్టేషన్ సమీపంలో ఎమర్జెన్సీ అంబులెన్సు సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో భాగంగా గురువారం అన్నదానం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబులెన్సు నిర్వాహకుల సేవలు విలువైనవని కొనియాడారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస ప్రసాద్, అంబులెన్సు సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.